ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
ఆదివారం 25 ఫిబ్రవరి 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 22.0


టిక్కెట్లు దక్కించుకుని స్వీట్స్ తినిపించుకుంటున్న ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి

• **ఇది ఉమ్మడి టిక్కెట్**

తణుకు అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా నాపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. టీడీపీకి టిక్కెట్ వచ్చినంత మాత్రాన జనసేన నాయకులు తక్కువేమీ కాదు. ఇది టీడీపీ, జనసేన ఉమ్మడి టిక్కెట్. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధిస్తా.

• **అందరిని కలుపుకుని వెళతా**

ఉండి అభ్యర్థి, ఎమ్మెల్యే మంతెన రామరాజు

చంద్రబాబు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మరోసారి అవకాశం కల్పిస్తానని ఇచ్చిన మాట ప్రకారమే నిలబెట్టుకున్నారు. అధిష్ఠానం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. వచ్చే ఎన్నికలకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల తోపాటు ప్రతీ నాయకుడిని కలుపుకుని వెళ్లి కూటమి అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తాం.

• **సమన్వయంతో విజయం**

- నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి



పార్టీ అధిష్ఠానం నాపై వుంచిన నమ్మకాన్ని నిలబెడతా. నూజివీడులో టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయం. నేను ఇక్కడకు కొత్తగా వచ్చా. ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుంటూ కార్యకర్తలు, నాయకులను కలుసుకునే విషయంలో ఆలస్యం జరిగితే అన్యదా భావించొద్దు. సమయం తక్కువగా ఉండడంతో వరుసగా అందరిని కలుస్తున్నా. సమన్వయంతో విజయం సాధిస్తా.

ఉమ్మడిగా ఏడుగురు


ఏలూరులో టీడీపీ శ్రేణుల సంబరాలు

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో టీడీపీ తొలి జాబితా విడుదల

సస్పెన్స్‌లో జనసేన జాబితా.. నేడో రేపో కీలక ప్రకటన

» సిట్టింగులు నిమ్మల, మంతెనకు అవకాశం.. రోషన్, చంటికి లక్కీ ఛాన్స్
» పితాని, ఆరిమిల్లి సహా ఎమ్మెల్యే పార్థసారథికి ప్రాధాన్యత
» తొలి జాబితాలో కనిపించని చింతమనేని, గన్ని
» అసంతృప్తితో మాజీ ఎమ్మెల్యే శివ.. త్వరలో కీలక నిర్ణయం


తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన నేతల అభివాదం

ఏలూరు, నరసాపురం లోక్‌సభ నియోజక వర్గాల పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం తన అభ్యర్థులను ప్రకటించింది. ప్రత్యేకించి కీలక నియోజకవర్గాలను పెండింగ్‌లో పెట్టారు. టిక్కెట్ ఖరారైన నియోజకవర్గాల్లో ఆయా అభ్యర్థులు, కేడర్ సంబరాలు చేసుకున్నారు. జనసేనకు 24 స్థానాలు కేటాయించినా జిల్లాలో ఏ ఏ స్థానాలనేవి ఆ పార్టీ తేల్చలేకపోయింది. దీంతో ఆ పార్టీలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రత్యేకించి లోక్‌సభ స్థానాల నుంచి పోటీకి దింపదలచిన వారి వివరాలు ఒకటి రెండ్రోజుల్లోనే ప్రకటించనున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నెలల తరబడి సాగిన టెన్షన్ శనివారంతో కాస్త తీరింది. తెలుగుదేశం-జనసేన ఎన్నికల పొత్తు అధికారికంగా ఖరారైన తర్వాత ఉమ్మడి జిల్లాలో ఈ రెండు పార్టీల నడుమ ఆశావహులంతా ఉత్కంఠకు గురయ్యారు. ఎవరికి ఏ స్థానం కేటాయిస్తారనే గందరగోళంలో మునిగితేలారు. ఆచంట నియోజకవర్గం నుంచే సీనియర్ నేత, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని ఖరారుచేశారు. పితాని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా వున్నారు. వైఎస్, చంద్రబాబు మంత్రి వర్గాల్లో పనిచేసిన అనుభవం వుంది. బీసీ వర్గాల్లో పెద్ద దిక్కుగా వున్న పితాని టీడీపీలో గట్టి పట్టు సాధించారు. ఈ స్థానంలో ఆయనకు పోటీగా మరెవరూ లేనంతగా పితాని రాజకీయాల్లో కొనసాగుతూ వచ్చారు. తాజాగా ఆచంట నుంచి ఆయన ఐదోసారి రంగంలోకి దిగుతున్నారు. మరో సీనియర్ నేత, అసెంబ్లీలో టీడీపీ ఉపనేత నిమ్మల రామానాయుడు మూడోసారి పాలకొల్లు నుంచి పోటీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గడచిన రెండుసార్లు ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కొని విజయం సాధించడమే కాకుండా గడచిన ఐదేళ్లలో అధికార వైసీపీ బనాయించిన అక్రమ కేసుల ఒత్తిళ్లతో సతమతమయ్యారు. అయినా ఖాతరు చేయకుండా ప్రజల పక్షాన నిలబడి, అసెంబ్లీలోనూ గళమెత్తడం ద్వారా అధికార పార్టీని గడగడలాడించారు. ఈసారి హ్యాట్రిక్ విజయం తనదేనన్న ధీమాతో నిమ్మల వున్నారు.

ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు స్థానం పదిలమైంది. సిట్టింగ్‌లకు తిరిగి టికెట్లు ఇస్తామని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు గతంలో చేసిన ప్రకటనను నిలుపుకున్నారు. తద్వారా ఎమ్మెల్యేకు రెండోసారి పోటీ చేసేందుకు అవకాశం చిక్కింది. ప్రజల్లో ప్రత్యక్షంగా కలియదిరగడం, వివాదరహితుడిగా పేరు పొందడం ఆయనకు కలిసొచ్చిన అంశాలు. ఉండి నుంచి ఈసారి తనకు టిక్కెట్ కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు పార్టీని అభ్యర్థించినా పని కాలేదు. ఇక్కడున్న పరిస్థితులు ఇంతకుముందే సిట్టింగులు అందరికీ టికెట్లు ఇచ్చి తీరతామని చంద్రబాబు ఇచ్చిన భరోసా తాజాగా తొలి జాబితాలో అక్షర రూపమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టిక్కెట్ దక్కకపోవడంతో శివ, ఆయన అనుకూల వర్గం తీవ్ర అసంతృప్తికి గురైంది. నేడో రేపో ఆయన కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వైసీపీ వర్గాలు శివను తమకు అనుకూలంగా ప్రసన్నం చేసుకోవడానికి సమాయత్తం అవుతున్నట్టు సమాచారం. తణుకు నియోజకవర్గంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఢీకొంటున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు తణుకు నుంచే మూడోసారి పోటీకి వీలుగా టీడీపీ టిక్కెట్ ప్రకటించింది. ఈ స్థానంలో జనసేన నుంచి అభ్యర్థి పోటీ చేస్తారని గతంలో పవన్ కల్యాణ్ ప్రకటించడం, అప్పటి నుంచి ఇప్పటి వరకు అటు టీడీపీ, ఇటు జనసేనలోనూ సాగిన టెన్షన్ కాస్తా ఆరిమిల్లి అభ్యర్థిత్వ ప్రకటనతో తొలగింది. టీడీపీ అధిష్ఠానం ప్రకటనతో టీడీపీ కేడర్ సంబరాలు చేసుకుంది.

ఏలూరు పార్లమెంట్ పరిధిలో..

ఏలూరు పార్లమెంట్ స్థానం పరిధిలో మూడు సీట్లు ఖరారయ్యాయి. ఏలూరు సీటు ఎవరికి కేటాయిస్తారోనని కొన్నాళ్లుగా సాగిన ఉత్కంఠను బడేటి చంటిని అభ్యర్థిగా ప్రకటించి టీడీపీ పూర్తిగా తొలగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం చంటికి ఇదే తొలి అనుభవం. తన సోదరుడు బడేటి బుజ్జి 2014 ఎన్నికల్లో ఏలూరు నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలవడమే కాకుండా ఆకస్మికంగా మృతి చెందారు. బడేటి కుటుంబపక్షాన చంటి తెర ముందుకు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుకుదనం పెంచారు. దీనికి తోడు దాదాపు అన్ని సర్వేల్లోను చంటికి అనుకూలతే లభించడంతో ఆయనకు టీడీపీ టిక్కెట్ ఖరారు చేశారు. రాజకీయాల్లో గడచిన దశాబ్దకాలంగా కొనసాగుతున్న సొంగా రోషన్ కుమార్‌ను ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన చింతలపూడి అభ్యర్థిగా ప్రకటించారు. రోషన్ సైతం తొలిసారిగా ఎన్నికల్లో పోటీకి దిగుతున్నారు. స్థానికంగా నేతలను కలుపుకు పోవడం, వివాదాలకు దూరంగా ఉండడం కరోనా సమయంలో ప్రజలకు చేయూతనివ్వడం, స్థానికుడు కావడంతో ఆయనకు టిక్కెట్ దక్కింది. పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడుగా కొనసాగి జిల్లాలో రెండవ అతిపెద్ద నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారు. దీర్ఘకాలంపాటు రాజకీయాల్లో వెలుగొందిన పెనమలూరు సిటింగ్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఈ మధ్యనే వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. బీసీ వర్గాలకు చెందిన ఆయన 2004లో కాంగ్రెస్ పక్షాన పామర్రు నుంచి తొలిసారి గెలుపొందారు. ఆ తర్వాత 2009లోనూ ఇదే నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 2014లో మచిలీపట్నం ఎంపీగా వైసీపీ పక్షాన పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పెనమలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. రాజకీయ సమీకరణల్లో భాగంగా మార్పులు చేర్పులు జరిగి వైసీపీని వీడి టీడీపీలో చేరగా తాజాగా నూజివీడు సీటును కేటాయిస్తూ తెలుగుదేశం విధాన ప్రకటన చేసింది.

ఉమ్మడి సభ నిర్వహణకు.. 12 మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో టీడీపీ నుంచి ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, ఎంపీ సత్యనారాయణరాజు, తోట సీతారామలక్ష్మి, వలవల బాబ్జి, జనసేన నుంచి కొటికలపూడి గోవిందరావు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చాగంటి మురళీకృష్ణ, రత్నం అయ్యప్ప ఉన్నారు.

జనసేనకు సీట్లెన్ని ?

ఉమ్మడి పొత్తులో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ శనివారం ఉమ్మడిగా తమ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. జనసేనకు 24 సీట్లు కేటాయించినా, కేవలం ఐదు స్థానాలను, అభ్యర్థులను మాత్రమే పవన్ ప్రకటించారు. నరసాపురం, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఎన్ని సీట్లు జనసేనకు కేటాయించిందనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఆఖరికి భీమవరం నుంచి పవన్ కల్యాణ్ పోటీకి సిద్ధంగా ఉండగా ఏ కారణం చేతనో తొలి జాబితాలో ఆయన పేరు ప్రకటించలేదు. దీంతో జనసేన కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు తీవ్రంగా కలత చెందారు. ఈ నెల 28న గూడెంలో జనసేన-టీడీపీ ఉమ్మడి సభ జరగనుండడంతో ఆ లోపే ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను పవన్ ప్రకటిస్తారని భావిస్తున్నారు. జిల్లాలో నాలుగు, లేదా ఐదు స్థానాలు జనసేనకు కేటాయించినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో జనసేనలో ఆశావహులంతా సమాచారం కోసం శనివారం క్షణం తీరిక లేకుండా గడిపారు. ముందుగా ప్రచారం సాగినట్టుగానే జనసేన జాబితా ఉండబోతుందా అనే ఉత్కంఠే ఇప్పుడు మళ్లీ ఆరంభమైంది. టీడీపీ టికెట్లు ఖరారు కాని నియోజకవర్గాలన్నిటిలోనూ జనసేన టెన్షన్ ఊపిరి సలపనీయనంతగా మారింది.

• **ప్రజల రుణం తీర్చుకుంటా**

పాలకొల్లు అభ్యర్థి, ఎమ్మెల్యే రామానాయుడు

పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు 2014, 2019 ఎన్నికల్లో నా మీద నమ్మకంతో నన్ను ఆదరించి గెలిపించారు. టీడీపీ అధికారంలో ఉండగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించా. ఈ ఐదేళ్లు ప్రజల వెంటే నడిచి సమస్యలపై పోరాటం చేస్తున్నా. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని ఈసారి నిలబెట్టుకుంటా. మూడోసారి టికెట్ ఇచ్చిన చంద్రబాబు, పవన్‌ల నమ్మకాన్ని కాపాడుకుంటా. మూడోసారి అత్యధిక మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తా.

సీనియర్ల పరిస్థితి ఏమిటి ?

తెలుగుదేశం తొలి జాబితాలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, దెందులూరు ఫైర్ బ్రాండ్ చింతమనేని ప్రభాకర్‌కు చోటు దక్కకపోవడం పార్టీ వర్గాల్లో విస్మయం కలిగించింది. ప్రత్యేకించి ఈ రెండు స్థానాల్లో ఆ పార్టీకి పూర్తిగా పట్టుంది. వివిధ సర్వేల్లోనూ వీరిద్దరికే అనుకూలత ఉన్నట్టు చెబుతున్నారు. తీరా తొలి జాబితాలో స్థానం దక్కకపోవడంతో ఆయా నియోజకవర్గాల కార్యకర్తలు, నేతలు తీవ్రంగా మదనపడుతున్నారు. టీడీపీ అధిష్ఠానం ఈ మేరకు ఆచి తూచి నిర్ణయం తీసుకుందని కొందరు జనసేన పొత్తు దరిమిలా నిర్ణయాలు పెండింగ్‌లో వుంచారని ఇంకొందరు ఊహాగానాలు ప్రచారం చేశారు. కైకలూరును బీజేపీ పొత్తు దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో పెట్టారని సమాచారం. ఈ స్థానం నుంచి మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు టిక్కెట్ ఆశిస్తున్నారు.


చంటి విజయకేతనం

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వం

- ఏలూరు అభ్యర్థి బడేటి చంటి

వైసీపీ అరాచక పాలనతో విసుగెత్తిన రాష్ట్ర ప్రజలు టీడీపీ-జనసేన కూటమి వైపు చూస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించ డం ఖాయం. టీడీపీ-జనసేన కూటమి కలయిక పట్ల ప్రజలు సంతృప్తి గా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా నా గెలుపు ఖాయం. కార్యకర్తలే మా బలం. వారికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం.


రోషన్‌కు అభినందనలు

ఐక్యతతోనే విజయం సాధిస్తాం

- చింతలపూడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి పార్టీలో ఎటువంటి విబేధాలు లేవు. అందరూ ఐక్యంగా ఉన్నాం. అందరినీ కలుపుకుని చింతలపూడి విజయానికి కృషి చేస్తా. నాకు అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్ఠానానికి, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. చింతలపూడి ప్రజలందరికి ఎన్నో సేవలు చేస్తూ వచ్చాను. అమెరికాలో ఉద్యోగాన్ని వదిలేసి ప్రజా సేవ కోసమే వచ్చాను.

34 స్థానాలూ మనవే

ఆచంట అభ్యర్థి పితాని సత్యనారాయణ

ఈ ఎన్నికల్లో జనసేన-టీడీపీ విజయ దుందుభి మోగిస్తుంది. ఉమ్మడి ఉభయ గోదా వరి జిల్లాలోని 34 స్థానాల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేస్తుంది. ఈ కూటమిలోకి బీజేపీ చేరితే స్వాగతిస్తాం. ఇప్పటికే చంద్రబాబుతో ఆ పార్టీ పెద్దలు చర్చించారు.

ప్రత్తిపాడు సభ దద్దరిల్లాలి

ఏపీకి జగన్ పాలన నుంచి విముక్తి కలిగించాలి : టీడీపీ-జనసేన నాయకుల సమన్వయ సమావేశంలో నేతలు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24 : టీడీపీ, జనసేన పార్టీలు కలిసి ఉమ్మడిగా నిర్వహించే మొట్ట మొదటి భారీ బహిరంగ సభను చూసి అధికార వైసీపీ అభ్యర్థులు పోటీ చేసేందుకు భయపడే విధంగా ఉండాలని టీడీపీ జోన్-2 ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన ఉభయ పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొనే ఈ బహిరంగ సభ నిర్వహణపై శనివారం తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలలో ఎవరికి టికెట్లు వచ్చినా మిగిలిన వారు కలిసి పనిచేసే విధంగా సంసిద్ధంగా ఉండాలని, రెండో ఆలోచన పెట్టుకోకూడదన్నారు.

- జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ ఉమ్మడి సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. ఈ సభ ద్వారానే జనసేన, టీడీపీ కలిసి రాష్ట్రాభివృద్ధికి కలిసి పనిచేస్తాయనే సంకేతాలు ఇవ్వాలన్నారు.
- టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌ల ఉమ్మడి నాయకత్వంలో పనిచేస్తే ప్రజల అభీష్టం నెరవేరుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు.
- పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జగన్ పాలన నుంచి ఏపీకి విముక్తి కలిగించే విధంగా ప్రతీ టీడీపీ, జనసేన కార్యకర్త పనిచేయాలన్నారు. సభకు ఆరు లక్షలకు పైగా నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చే విధంగా సభ నిర్వహించాలన్నారు. దీనికోసం బస్సులు, కార్లు, సిద్ధం చేసుకోవాలన్నారు.
- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఉమ్మడి సభ నిర్వహణకు ఉవ్వెత్తున అభిమానులు వచ్చేలా పనిచేయాలన్నారు. ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనతో తాడేపల్లి ప్యాలెస్‌లో భూకంపం వచ్చిందన్నారు.
- తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం ఈ ఉమ్మడి సభపైనే చర్చించుకునే విధంగా సభ నిర్వహిస్తామన్నారు. అంతా సమన్వయంతో పనిచేస్తేనే అది సాధ్యం అవుతుందన్నారు.
- నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి సభకు నియోజకవర్గం నుంచే 70 వేల మందిని తరలించే విధంగా బాధ్యతలు తీసుకుందామని పిలుపునిచ్చారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, టీడీపీ, జనసేన నాయకులు పితాని సత్యనారాయణ, కేఎస్ జవహర్, బూరుగుపల్లి శేషారావు, గన్ని వీరాంజనేయులు, మాకా ఈశ్వరయ్య, కంచాల వెంకటలక్ష్మి, బీవీ రావు, యర్రింకి సూర్యారావు, పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2 లోగా నిర్మాణ పనులు ప్రారంభించాలి

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : జిల్లాలో వివిధ శాఖల నిధుల ద్వారా మంజూరై ఇంకా ప్రారంభం కాని నిర్మాణాలకు సంబంధించి మార్చి 2వ తేదీలోగా పనులు ప్రారంభించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారంవివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో పనుల ప్రగతి పై సమీక్షించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ, గృహనిర్మాణ శాఖ పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ సొమ్ము చెల్లించలేని ఖైదీల విడుదలకు ఆర్థిక సాయం

సుప్రీంకోర్టు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు పూచీకత్తు, జరిమానా చెల్లించలేక జైళ్లల్లో మగ్గుతున్న విచారణ, ఇతర ఖైదీలను గుర్తించి ఆర్థిక సాయం, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాస్థాయి సాధికార కమిటీ సమావేశం శనివారం జరిగింది. సాధికార కమిటీ సభ్యులు, 7వ అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ రత్నప్రసాద్, ఎస్పీ మేరీ ప్రశాంతి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో బాల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కో-ఆర్డినేటర్ సంజీవరావు ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి పదో తేదీన జరిగే ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 28వ తేదీ వరకు పొడిగించామన్నారు. వివరాలకు ఫోన్ నెంబరు 79955 62116లో సంప్రదించాలన్నారు.

నేడే గ్రూప్-2 పరీక్ష



» 39 పరీక్షా కేంద్రాలు.. 13,977 మంది అభ్యర్థులు.. కేంద్రాల వద్ద 144 సెక్షన్
» కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్.. కంట్రోల్ రూమ్
» కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -2 పరీక్షల నిర్వహణలో భాగంగా ఏలూరు జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ శనివారం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'గ్రూప్-2 సర్వీసెస్ కింద నిర్వహించనున్న (స్క్రీనింగ్ టెస్ట్) ఆబ్జెక్టివ్ పరీక్షలు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయి. 13,977 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 39 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. ఇందుకోసం 19 రూట్‌లు ఏర్పాటు చేశాం. 19 మంది రూట్ ఆఫీసర్లు, 39 మంది లైజన్ ఆఫీసర్లను నియమించాం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పోలీస్ బందోబస్తు నిర్వహించాలి. కేంద్రాల వద్ద మెడికల్ టీమ్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. పరీక్షా కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా నిరంతరం జరగాలి. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలి. ఉదయం 9.30 గంటలకల్లా అభ్యర్థులు పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలి. అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశాం. 90145 50897, 99121 07709, 94910 41436 నెంబర్లలో అధికారులు అందుబాటులో ఉంటారు..' అని వివరించారు. సమావేశంలో ఏఎస్పీ స్వరూపరాణి, ఇన్‌చార్జ్ డీఆర్వో ఖాజావలీ, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

ఏలూరు క్రైం : జిల్లాలో గ్రూప్ -2 స్క్రీనింగ్ టెస్టుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకున్నా మని ఎస్పీ మేరీ ప్రశాంతి వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ శాఖ 30 విధించామని ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మహిళా అభ్యర్థులను తనిఖీ చేసేందుకు మహిళా పోలీస్ సిబ్బందిని నియమించామని, పరీక్షా కేంద్రాల సమీపంలో ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు మూయించి వేస్తున్నామన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 'నో సెల్‌ఫోన్ జోన్'

» **డీవీఈవో ప్రభాకరరావు**

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద అన్ని పరీక్షా కేంద్రాలను 'నో సెల్‌ఫోన్ జోన్'గా ప్రకటించడంతో పాటు, సిబ్బంది ఎవ్వరూ ఫోన్లను తీసుకురాకూడదని ముందుగానే హెచ్చరించాలని డీవీఈవో ప్రభాకరరావు స్పష్టం చేశారు. మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షించారు. జిల్లాలో 51 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, పరీక్షల పర్యవేక్షణ కోసం ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 08812-230197 నెంబరుతో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని, విద్యార్థులను కేంద్రాల్లోకి ఉదయం 8.30 గంటలకే అనుమతించాలని, 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించవద్దన్నారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తా మని జిల్లా ఉపరవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం, రాష్ట్ర రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు లేని రవాణా, రవాణేతర వాహనాలకు ఇకపై ఫిట్‌నెస్, రెన్యువల్ చేయబడవన్నారు. కొత్త వాహనాలకు డీలర్ల వద్దే నెంబర్ ప్లేట్లు బిగిస్తారని, పాత వాహనాలకు మార్చి 1వ తేదీ నుంచి ఎస్ఐఏఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాల న్నారు. ఈ విధానంలో రెండు వెసులుబాట్లు కల్పిస్తున్నామని ఒకటి డీలర్ వద్ద కాగా, వాహన యజమాని ఇంటి వద్దనే నెంబర్ ప్లేటు బిగించే విధానం ఉందన్నారు. వాహనదారులు ఏదైనా సమాచారం తెలుసుకోవాలంటే సంబంధిత రవాణా శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న డీపీవో విశ్వనాథ్, తదితరులు

స్వీప్‌తో పోలింగ్ శాతం పెంపు : డీపీవో

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24: రానున్న ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్‌శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు స్వీప్ నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్ అన్నారు. పోలింగ్‌శాతం పెంచే లక్ష్యంగా శనివారం వివిధ శాఖలతో కలిసి ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 92 శాతం ఓటింగ్ నమోదుకు అన్ని ప్రాంతాల్లో స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, పశువర్ధకశాఖ జేడీ నెహ్రూబాబు, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంల వద్ద పూర్తిస్థాయి భద్రత

పెదపాడు : సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసినట్టు రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. పలు నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు శనివారం వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరిం గ్ కళాశాలలోని ఎన్నికల స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు : ఆర్ఐవో



భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్ఐవో పరీక్షల విభాగ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు సూచించారు. భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో శనివారం జిల్లాలోని కళాశాల అధ్యాపకులు, పరీక్షల పర్య వేక్షకులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలకు ప్రథమ సంవత్సరం 17,806 మంది, రెండో సంవత్సరం 18,143 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 8:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమ తిస్తార న్నారు. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించమన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయా కేంద్రాల పరిధిని మొబైల్ ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించామన్నారు. విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రాల్లోని పర్యవేక్షకులకు కూడా చరవాణి అనుమతి లేదన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లా పరీక్షల విభాగ సభ్యులు శ్రీనివాసరావు, నరసింహమూర్తి, రాజ్‌కృష్ణ, ఇంటర్మీడియట్ విద్యావిభాగ జిల్లా అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ఇద్దరు ఉపాధ్యాయులకు చార్జ్ మెమో



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈవో అబ్రహం

పెదవేగి, ఫిబ్రవరి 24 : పెదవేగి మండలం విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులకు చార్జ్‌మెమో ఇస్తూ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎస్. అబ్రహం ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో శనివారం విజయరాయి జడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎఫ్ఏ-4 ఆంగ్ల పరీక్ష జరుగుతోంది. కాగా 4,5 తరగతుల విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడు తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఎం.వెంకటరమణతో పాటు ఆంగ్ల ఉపాధ్యాయులు డి.హరిప్రసాద్, కె.నీలిమలకు చార్జ్ మెమోలు జారీచేశారు. పరీక్షల నిర్వహణ సమయంలో అలసత్వం వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెంటపాడు ఎంఈవో-1 శ్రీనివాస్‌పై విచారణ

పెంటపాడు, ఫిబ్రవరి 24 : పెంటపాడు మండల ఎంఈవో-1 శ్రీనివాస్‌పై శనివారం తాడేపల్లిగూడెం డీవైఈవో ఎస్.రవీంద్ర భారతి విచారణ చేపట్టారు. ఎంఈవో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో కూడా పనిచేస్తున్న ఉపాధ్యాయులను డిప్యుటేషన్లపై పంపిచేస్తున్నారని, గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులతో ఎటువంటి సంప్రదింపులు చేయకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని మండల జడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి జిల్లా విద్యాశాఖాధికారికి చేసిన ఫిర్యాదు మేరకు డీవైఈవో విచారణ చేపట్టారు.ఎంపీపీ దాసరి హైమావతి, జట్లపాలెం గ్రామానికి చెందిన మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కట్టుబోయిన కృష్ణప్రసాద్, గ్రామ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ రావి దుర్గారావులు కూడా పలు సమస్యలను డీవైఈవో దృష్టికి తీసుకువచ్చారు. డీవైఈవో మాట్లాడుతూ అందరి అభిప్రాయాలు సేకరించామని నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పరిశోధనా కృషికి పబ్లికేషన్లే కొలమానం

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు, ఆచార్యుల పరిశోధనా కృషికి పబ్లికేషన్లే కొలమానమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (కాంచిపురం, చెన్నై) ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.చిట్టిబాబు అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డిల పర్యవేక్షణలో సంస్థలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నాణ్యమైన, సమర్థవంతమైన పరిశోధనా పత్రాలను పేరెన్నిక కలిగిన అంతర్జాతీయ జర్నల్స్‌లో ఏ విధంగా ప్రచురించాలనే అంశంపై ఏపీ నిట్ ప్రాంగణంలో శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకురావాలన్నారు. నాణ్యమైన పరిశోధన ప్రచురిస్తే ఐఐటీ, ఎన్ఐటీ వంటి విద్యాసంస్థలతో పాటూ పేరెన్నిక కల్గిన కంపెనీలలో ఉద్యోగాలను దక్కించుకోవచ్చునన్నారు.



ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి

బెంగళూరు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బబ్రతా దాస్

తాడేపల్లిగూడెం రూరల్,ఫిబ్రవరి 24: విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక విద్యను అభ్యసించాలని అప్పుడే మారుతున్న పోటీ ప్రపంచంలో ముందుకెళ్తారని బెంగళూరు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బబ్రతాదాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ట్రిపుల్‌ఈ 2024 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మరో విశిష్ట అతిథి నేతాజీ సుబాష్ చంద్రబోస్ వర్శిటీ (న్యూఢిల్లీ) డైరెక్టర్ డాక్టర్ ప్రేరణా గౌర్ మాట్లాడుతూ వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రొఫెసర్‌లు, రీసెర్చ్ విద్యార్థులను ఒకేవేదిక మీదకు తెచ్చి ఆవిష్కరణలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. వీటి ద్వారా మన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ పేపర్స్ ప్రదర్శన వల్ల తమ కళాశాల విద్యార్థులకే కాకుండా మన ప్రాంతంలోని ఇతర పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ ఎండీ ఇస్మాయిల్, కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.ప్రాజెక్టుల ప్రదర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల, యూఎస్, యూకేల నుంచి 80 ప్రాజెక్టులను 180 మంది విద్యార్థులు ప్రదర్శించారు.

తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

ఆకివీడు, ఫిబ్రవరి 24: కుప్పనపూడిలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్టు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.వారినుంచి రూ.8,300 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ట్రాన్స్‌కోకు బకాయిల షాక్

పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు

ఉమ్మడి జిల్లాలో రూ.1207.64 కోట్లు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 24: విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బకాయిల భారంతో విద్యుత్ సంస్థలు ఆర్థికంగా తల్లడిల్లుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నా బకాయిల వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు ఒక్కనెల బిల్లు చెల్లించకపోతే సర్వీసులను తొలగిం చేస్తారు. స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థల నుంచి బకాయిల వసూళ్లు విద్యుత్ శాఖకు పెనుభారంగా పరిణమించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా రావాల్సిన విద్యుత్ బకాయిలు రూ. 1207.64 కోట్లు వరకు ఉన్నాయని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి. విద్యుత్ బకాయిలు మొత్తంలో స్థానిక సంస్థలదే అగ్రభాగంగా నిలిచిందని చెబుతున్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి ఆర్థిక సంఘ నిధుల నుంచి విద్యుత్ బకాయిలు చెల్లించాలని చెబుతున్నా సక్రమంగా జరగకపోవడంతో విద్యుత్ బకాయిలు పేరుకు పోతు న్నాయని చెబుతున్నారు.ప్రభుత్వ సంస్థల నుంచి కూడా రావాల్సిన బకాయిలు సక్రమంగా వసూలు కావడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.



బకాయిలు ఇలా

జిల్లాలో ప్రభుత్వ సంస్థలకు సంబంధించి ఇప్పటివరకు విద్యుత్ బకా యిలు రూ. 600.72 కోట్లు వరకు ఉన్నాయి. స్థానిక సంస్థల విషయాని కొస్తే రూ. 606.90 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. ప్రధా నంగా పంచాయతీలలో వీధి దీపాలకు సంబంధించి రూ. 72.51 కోట్లు, వాటర్ వర్క్స్‌కు సంబంధించి రూ. 474.18 కోట్లు , మున్సిపాల్టీల్లో విద్యుత్ దీపాలకు సంబంధించి రూ. రూ.2.31 కోట్లు, మున్సిపాల్టీలలో వాటర్ వర్క్సుకు సంబంధించి రూ.9.66 కోట్లు, మున్సిపల్ కార్పోరేషన్‌లో విద్యుత్ దీపాలకు సంబంధించి రూ.6.19 కోట్లు, మున్సిపల్ కార్పోరేషన్‌లో వాటర్ వర్క్సుకు సంబంధించి రూ.40.81 కోట్లు, ఎన్‌టీఆర్ సుజల పథకానికి సంబంధించి రూ.1.22 కోట్లు బకాయిలు ఉన్నాయని నివేదికల్లో పేర్కొన్నాయి. స్థానిక సంస్థలకు సంబంధించి విద్యుత్ డివిజన్ల వారీగా పరిశీలిస్తే భీమవరం డివిజన్‌లో రూ. 23.06 కోట్లు, ఏలూరు రూ. 241.81 కోట్లు, జంగారెడ్డిగూడెం రూ.114.33 కోట్లు, నరసాపురం రూ. 21.90 కోట్లు, నిడదవోలు రూ.146.42 కోట్లు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో రూ. 49.40 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. ఇక స్థానిక సంస్థలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మొత్తంలో ఎల్‌టీ విద్యుత్ బకాయిలు రూ. 596.94 కోట్లు ఉండగా, హెచ్‌టీ బకాయిలు రూ. 9.96 కోట్ల వరకు ఉన్నాయి.



నిప్పుల గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు..గాలాయిగూడెం అమ్మవారు

నిప్పుల గుండం తొక్కిన భక్తులు

దెందులూరు , ఫిబ్రవరి 24 : దెందులూరు మండలం గాలాయిగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో నిప్పుల గుండం ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరా, సారె, బోనాలు సమర్పించారు. అగ్నిగుండం తొక్కడం వల్ల పిల్లలు లేని వారికి పిల్లలు పుడతారని, తమ భర్త నిండునూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలనే నమ్మకంతో భక్తులు నిప్పులను తొక్కుతారు. శనివారం సుమారు 30 వేల మంది వరకూ నిప్పుల గుండ ప్రవేశం చేశారు.



వైభవంగా లక్ష్మీనరసింహస్వామికి చక్రస్నానం



చక్రస్నానం నిర్వహించిన అర్చకులు

అంతర్వేది, ఫిబ్రవరి 24: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి పురస్కరించుకుని శని వారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయం వద్ద నుంచి అలంకార మండపంలో పూజలందుకున్న స్వామివారు గరుడ పుష్పక వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగారు. పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళవాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామికి, చక్రపెరుమాళ్ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరూరు ఉద్దండ పండితుల శిరస్సుపై శ్రీ చక్రపెరుమాళ్‌ను ఉంచి సముద్ర స్నానం చేశారు. స్వామితో పాటు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు, అగ్నికుల క్షత్రియులు పున్నమి స్నానాలు ఆచరించారు. అనంతరం పూజలు అందుకున్న స్వామి, చక్రపెరుమాళ్‌ను వసంత మండపానికి అర్చకులు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామికి నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదం పంచారు. రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం సాయంత్రం గ్రామ చెరువులో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. రాత్రి దర్పణసేవ, పుణ్యాహవచనం, శ్రీపుష్పో త్సవం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

'టెట్' రాష్ట్ర పరిశీలకుడిగా నరసింహారావు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : ఏపీ ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్)లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షలు ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాల, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, అగిరిపల్లిలోని ఎన్నారై కళాశాలల్లో జరుగుతాయి. రోజుకి రెండు సెషన్లలో నిర్వహించే ఈ పరీక్షలకు రాష్ట్రస్థాయి పరిశీలకుడిగా ఏపీ రెసి డెన్షియల్ స్కూల్స్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు నియమితుల య్యారు. నాలుగు పరీక్షా కేంద్రాలకు నలుగురు ప్రధానోపాధ్యాయులను నోడల్ ఆఫీసర్లుగా నియమించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)లుగా ఈనెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు జిల్లాలో జరుగుతాయి. జిల్లాలో ఎంతమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నదీ వివరాలను విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదివారం పంపించనున్నారు.



లక్ష్మీనారసింహునికి హారతులిస్తున్న అర్చకులు.. పొంగళ్లు వండుతున్న మహిళలు

కమనీయం..చందనోత్సవం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24: ఉగ్రనారసింహుడు చందనలేపనంతో సేదతీరారు. సుందరగిరిపై ఐఎస్. జగన్నాథపురం ఆలయంలో కొలువైన లక్ష్మీనారసింహుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం జరిగిన శ్రీచందనోత్సవం భక్తజనులకు నేత్రపర్వమైంది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు, మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకాలను నిర్వహించారు.చందనాన్ని విశేషంగా పూశారు. పలువురు మహిళా భక్తులు కొండపై పాలపొంగళ్లను వండి స్వామివారికి నివేదన చేశారు. మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణ జరిపించారు. శనివారం కావడంతో వెంకన్న క్షేత్రం భక్తుల రాకతో కళకళలాడింది. దాదాపు 20వేల మంది పైబడి యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి.



ఎస్ఐ శిక్షణకు వెళ్ళే అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

శిక్షణలో చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : ఐజీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : ఎస్ఐ రిక్రూట్‌మెంట్‌లో వివిధ పోస్టులకు అర్హత సాధించిన ఏలూరు రేంజ్ పరిధిలోని 105 సివిల్ ఎస్ఐ పోస్టులకు 103 ఎంపికయ్యారు. వీరిని శిక్షణకు శనివారం పంపిస్తున్న సందర్భంలో ఏలూరు రేంజ్ డీఐజీ కార్యాలయం వద్ద ఐజీ మాట్లాడారు. ఏలూరు రేంజ్ పరిధిలోని జోన్ 2లో 105 మంది సివిల్ పోస్టులకు 103 ఎంపిక అయ్యారని వీరిలో సివిల్ ఎస్ఐ పోస్టులకు 93 మందిని అనంతపురం ట్రైనింగ్ కాలేజీకి శిక్షణ నిమిత్తం పంపుతున్నామన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్స్ సివిల్ పురుషులు, మహిళలు ఎంపికైన వారిలో 12 మంది పోలీస్ కాని స్టేబుళ్ళు ఉన్నారన్నారు. ప్రజాసేవ చేసే అవకాశం ప్రత్యక్షంగా పోలీసులకే ఉంటుందని మీ అందరికీ అలాంటి అరుదైన గౌరవం దక్కిందని, శిక్షణ సమయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు.


బ్రిటీష్ కాలం నాటి జైలు కూల్చివేత

కైకలూరులో నూతన సబ్ జైలు నిర్మాణానికి శ్రీకారం



కైకలూరు, ఫిబ్రవరి 24: బ్రిటిష్ కట్టడాలకు కాలం చెల్లింది. 1913లో బ్రిటిష్ అధికారులు నిర్మించిన జైళ్ళల్లో కైకలూరు పట్టణంలోని సబ్‌జైలు ఒకటి. కైకలూరు కేంద్రంగా పూర్వం బ్రిటిష్ పాలన సాగుతూ వస్తుండగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి అనుకుని 24 సెల్స్ ఏర్పాటు చేస్తూ జైలు నిర్మించారు.ఈ జైలు శిథిలావస్థకు చేరడంతో దీనిని కూల్చివేసి ఆధునిక వసతులతో కూడిన జైలు నిర్మాణానికి గత ఏడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. రూ. రెండు కోట్లతో దీనిని నిర్మించనున్నారు. రెండు రోజుల క్రితం 16 మంది ఖైదీలను మచిలీపట్నంలోని ఉమ్మడి కృష్ణా జిల్లా జైలుకు తర లించారు. సుమారు ఏడేళ్ల క్రితం వరకు 24 సెల్స్‌లో 4 సెల్స్‌ను మహిళా ఖైదీలకు వినియో గించుకునేలా జైలుశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అనంతరం మహిళా ఖైదీలను కైకలూరులో కాకుండా ఏలూరు కారాగారాలకు తరలించేవారు. నూతనంగా నిర్మించే జైల్లో ప్రత్యేకంగా మహిళా విభాగం ఏర్పాటు చేస్తున్నారు. ఈ జైల్లో దివంగత నాయకుడు వంగవీటి రంగా మూడు నెలల పాటు ఒక కేసులో ఇక్కడే శిక్ష అనుభవించినట్లుగా ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు.ఇప్పటికే జైలు ఖాళీ అవడంతో మరో నాలుగు రోజుల్లో పాత భవనాన్ని కూల్చే పనులు ప్రారంభిస్తున్నారు.

కాంగ్రెస్‌కు జెట్టి గురునాథరావు రాజీనామా



జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం,ఫిబ్రవరి 24 : కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జెట్టి గురునాథరావు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మెయిల్ ద్వారా పంపారు. కాంగ్రెసు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ క్యాడర్‌ను కాపాడుకుంటూ పార్టీలో ఉన్న ఆయన ఎన్నికలకు ముందు అకస్మాత్తుగా పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశం అయ్యింది. అధికార పార్టీ వైసీపీలో చేరనున్నట్టు తెలిసింది. గతేడాది కూడా గురునాథరావు టీడీపీలోకి మారుతున్నారనే ప్రచారం సాగింది. అయితే అప్పటి నుంచి మౌనంగా ఉన్న గురున్నాధరావు ఇప్పుడు తాజాగా కాంగ్రెసుకు రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాల్లో కాంగ్రెసు పార్టీలో ఉన్న గురున్నాధరావు అనుచరులు కూడా రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. కొయ్యలగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జుంగా జవహర్‌లాల్ నెహ్రూ (బాబ్జీ) రాజీనామా చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావుకు లేఖ పంపుతున్నట్లు తెలిపారు.



చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

క్రమశిక్షణతో జూనియర్లు ముందుకు సాగాలి

నరసాపురం, ఫిబ్రవరి 24: సీనియర్ న్యాయవాదులు అనుసరించిన క్రమశిక్షణ, సంప్రదాయాలను యువ న్యాయవాదులు పాటిస్తూ వృత్తిలో ముందుకు సాగాలని హైకోర్టు న్యాయమూర్తులు అన్నారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం కోర్టు ప్రాంగణంలో స్వర్గీయ ఆందే బాపన్న చిత్రపటాన్ని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి ఆకుల వెంకటశేషసాయి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరసాపురం బార్ అసోసియేషన్‌కు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఉద్దండులైన హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదుల్ని అందించిన ఘనత ఈ కోర్టుకే దక్కిందన్నారు. సీనియర్ న్యాయవాదులు ఓపిక ఉన్నంత వరకు కోర్టుకు వచ్చి సేవలందించాలన్నారు. మరో న్యాయమూర్తి నైనాల జయసూర్య మాట్లాడుతూ న్యాయవాదులు క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసినప్పుడే వృత్తిలో రాణించగలమన్నారు. మరో జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రజలకు న్యాయసలహాలను అందించడంలో న్యాయవాదులు ముందుండాల న్నారు. జస్టిస్ నూనేపల్లే హరినాథ్ మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని వృత్తిలో రాణించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు సభకు అధ్యక్షత వహించారు. విశ్రాంతి హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు, జిల్లా న్యాయమూర్తి పురుషోత్తమ్‌కుమార్, ఏపీ బార్ అసోసియేషన్ సభ్యులు కృష్ణారెడ్డి, సీనియర్ న్యాయవాదులు అర్‌కె బాబీ, అడబాల స్వామినాయుడు, వెంకటాచార్యులు, జ్ఞానప్రకాష్, సూరిబాబు, రఘురాం, కృష్ణారావు, పురేళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం



న్యాయాధికారి రామ్‌గోపాల్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భవ్యశ్రీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : నేడు ప్రతి ఒక్కరు యాంత్రిక జీవితంతో, ఒత్తిళ్ళకు గురై అనారోగ్యం పాలవుతున్నారని దీని నుంచి తప్పించుకోవడానికి ప్రతిఒక్కరు రోజుకు గంటైనా వ్యాయామం చేయాలని మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రామ్‌గోపాల్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ ఆదే శాల మేరకు జిల్లా కోర్టులో ఉన్న న్యాయ సేవాసదన్‌లో కోర్టు సిబ్బందికి, న్యాయ వాదులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధుల వైద్య శిబిరాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఈఎన్‌టీ డాక్టర్ భవ్యశ్రీ, డాక్టర్ చందనలు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి రత్నప్రసాద్ మాట్లాడుతూ కోర్టు సిబ్బంది, న్యాయవాదులు నిత్యం పని ఒత్తిడితో ఎన్నో ఇబ్బందులు పడుతుం టారని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడానికి వీలుగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ భవ్యశ్రీ మాట్లాడుతూ జిల్లాలో షుగరు, బీపీలకు గురవుతున్నారని వీటి వల్ల చెవి నరాలు దెబ్బతిని వినికిడి సమస్య వచ్చే ప్రమాదం ఉందని, ముక్కు వాసన కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించడం ఎంతో ముఖ్యమన్నారు. డాక్టర్ చందన మాట్లాడుతూ డస్ట్ ఎలర్జీ ఉన్నవారు మాస్క్ ధరించడం ఎంతో మంచిదని సూచించారు. ఏలూరు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తిగిరిపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

మార్చి 9న అంజుమన్ సంస్థ ఎన్నికలు



విలేకరులతో మాట్లాడుతున్న అంజుమన్ సంస్థ నాయకులు

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 24: పాలకవర్గం పదవీకాలం ముగియడంతో అంజుమన్ సంస్థకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభి స్తున్నట్లు అధ్యక్షుడు ఎమ్డీ సులేమాన్ తెలిపారు. ఎన్నికల కమిటీ కన్వీనర్ షేక్ ఇబ్రహీం, ఎన్నికల అధికారి చెదలవాడ వెంకటరమణ, ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. మార్చి 1 నుంచి 2 వరకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. 3న స్క్రూట్నీ, 4న ఉపసంహరణ, 5న ఎన్నికల గుర్తు కేటాయిస్తామన్నారు. 6 నుంచి 8 వరకు ప్రచారం నిర్వహించుకోవచ్చన్నారు. మార్చి 9న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మూడుజోన్‌ల పరిధిలో 35 మంది కార్యవర్గ సభ్యులు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. సమావేశంలో ఉప ఎన్నికల అధికారి ఉప్పులూరి హేమశంకర్, ఎన్నికల కమిటీ సభ్యులు ఎండీ ఇలియాస్, మున్వర్ షరీఫ్, సయ్యద్ బాజీ, ఎండీ జావేర్, సంస్థ సెక్రటరీ అమీద్‌జానీ, కోశాధికారి ఎం.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వు ఫారెస్టులోకి పులి తిరుగుముఖం



రెడ్డినాగంపాలెం సమీపంలో పులి పాదముద్రలు

పోలవరం, ఫిబ్రవరి 24 : రెండు నెలలుగా ప్రజానీకాన్ని భయాందోళనలకు గురి చేసి, అటవీశాఖ అధికారులను ముప్పు తిప్పలు పెట్టిన పులి శనివారం రిజర్వు ఫారెస్టులోకి వెళ్ళినట్లు అటవీక్షేత్రాధికారి దావీదురాజు తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం కరకపాడు అడవిలో రెండు మేకలను బలితీసుకున్న పులి అక్కడి నుంచి బుట్టాయిగూడెం మండలం లక్ష్మీపురం కొవ్వాడ గ్రామాల పరిధిలో సంచరించి పోలవరం మండలం రెడ్డినాగంపాలెం చేరుకుందని అక్కడి నుంచి రిజర్వు ఫారెస్టులోకి వెళ్ళి పోయిం దని, పులి పాదముద్రలు పరిశీలించామని అటవీశాఖ అధికారులు తెలిపారు. రామనరసాపురం, సరిపల్లికుంట, జిల్లెల్లగూడెం పంచాయతీల ప్రజలు పాడి పశువుల రైతులు అడవుల్లోకి వెళ్ళరాదని, పశువులను మేపడానికి అడవుల్లోకి వెళ్ళరాదని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైదాన ప్రాంతాల్లో పాడిపశువుల సంచార ప్రాంతాలు అలవాటు పడిన పులి మళ్ళీ రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పులి దాడిలో చనిపోయిన పాడి పశువుల రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

మెడికల్ రిప్రజెంటేటివ్ ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : కుటుంబ కలహాలతో భార్య ఆత్మహత్య కేసుకోగా తన బిడ్డను తనకు ఇవ్వాలని అత్తింటి వారిని కోరాడు. ఎన్ని రోజులకు బిడ్డను ఇవ్వక పోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఒక మెడికల్ రిప్రజెంటేటివ్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏలూరు రాణీనగర్‌కు చెందిన మంతిన రమేష్ (35) మెడికల్ రిప్రజెం టేటివ్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య వెంకటలక్ష్మి డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. వీరిద్దరి మధ్య రెండు నెలల క్రితం గొడవ రావడంతో వెంకటలక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వెంకటలక్ష్మి మరణించిన తరువాత తన కుమారుడిని తనకు ఇవ్వాలంటూ రమేష్ అత్తింటి వారిని కోరాడు. అప్పటి నుంచి ఇవ్వక పోవడంతో ఒంటరి జీవితం గడుపుతూ తీవ్ర మనస్థాపానికి గురై శనివారం వేకువజామున ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ నరసింహారావు, హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైరు పేలి వ్యాన్ పల్టీ..ఐదుగురికి తీవ్ర గాయాలు



ముసునూరు, ఫిబ్రవరి 24: మండలంలోని చిల్లబోయినపల్లి ప్రధాన రహదారిలో శనివారం సాయంత్రం టాటా ఏస్ వాహనం టైరు పేలి పల్టీ కొట్టిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు గాయపడ్డారు. ఏలూరు జిల్లా పేదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ వీరం పాలెంకు చెందిన 15 మంది టాటా ఏస్ వాహనంలో ముసునూరు మండలం చిల్లబోయినపల్లి వచ్చి మరో ఐదుగురుని ఎక్కించుకుని గోపవరం గ్రామంలో ఉదయం జరిగిన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠకు వచ్చారు. సాయంత్రం తిరిగి వెళుతున్న క్రమంలో చిల్లబోయినపల్లి ప్రధాన రహదారిలో టాటా ఏస్ వాహనం వెనుక టైర్ ఒక్కసారిగా పేలి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా వీరిలో ఇద్దరు మహిళలకు తలకు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన 15 మంది గాయాలపాలయ్యారు. వైస్ ఎంపీపీ పాముల గంగధరరావు, స్థానికులు క్షతగాత్రులను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న చింతమనేని ప్రభాకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శనివారం రాత్రి పరామర్శించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్..మహిళ మృతి



రమాదేవి (ఫైల్)..పరిశీలిస్తున్న పోలీసులు

పాలకోడేరు, ఫిబ్రవరి 24 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గొల్లలకోడేరు గ్రామంలో శని వారం సాయంత్రం చోటు చేసుకుంది. గొల్లలకోడేరు గ్రామం తోట శివారులో చేకూరి రమాదేవి (45) భర్త శ్రీహరిరాజుతో ఓ రేకుల షెడ్‌లో నివసిస్తున్నారు. వీరికి ఒక కుమార్తు, కుమార్తె ఉన్నారు. పాప బెంగుళూరులో చదువుతుండగా, బాబు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రమాదేవికి కొంత కాలంగా నరాల బలహీన వ్యాధితో బాధపడుతూ ఉంది. శ్రీహరిరాజు బయటకి పనిపై వెళ్ళగా, చేకూరి రమాదేవి మాత్రమే ఇంట్లో ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో ఆమె కాలి బూడిదైందని స్థానికులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 24 : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లుగా ఎఎస్ఐ విజయ కుమార్ తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన మహిళ శనివారం తెల్లవారుజామున టాయిలెట్‌కి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ళ వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ తెలియలేదు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

130 సెల్‌ఫోన్లు స్వాధీనం..బాధితులకు అందజేత



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : ఏలూరు జిల్లాలో ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లలో 130 ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి వెల్లడించారు. ఏలూరు పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోయిన ఫిర్యాదులను స్వీకరించామని వాటిలో జనవరి నెలలో 130 సెల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సిబ్బంది రికవరీ చేశారన్నారు. వీటి విలువ 19 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ మొత్తం 11 దఫాలుగా సెల్‌పోన్లు రికవరీ చేయడం జరిగిందని 1,455 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని వీటి విలువ 2 కోట్ల 90 లక్షల 69 వేల 684 రూపాయలని వెల్లడించారు. సెల్ ఫోన్లు కల్గిన వారు అత్యంత జాగ్రత్తగా తమ వస్తువు భద్రపర్చుకోవాలని, సెల్ ఫోన్లు నేరస్తులు అటెన్షన్ డ్రైవర్షన్ చేస్తారని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, బ్యాంకులు, ఏటీఎంలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో దృష్టి మళ్ళించి ఫోన్లను అపహరిస్తారన్నారు. ఫోన్లకు పాస్‌వర్డ్ లాక్ పెట్టుకోవడం ఎంతో మంచిద న్నారు. సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ డ్రమ్ము పేలి ఒకరికి తీవ్రగాయాలు



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24: ఖాళీ డ్రమ్ము కెమికల్ గ్యాస్‌తో నిండి పోవడంతో ఆ డ్రమ్ము ఓపెన్ చేస్తుండగా పేలి ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది.ఎల్. అగ్రహారంలో ప్లాస్టిక్ రిసైక్లింగ్ సెంటర్ వద్ద పాత డ్రమ్ము కట్ చేస్తున్న తరుణంలో పేలిపోవడంతో బీహార్‌కు చెందిన సచిన్ పొట్టలోంచి ప్రేగులు బయటపడ్డాయి. దీంతో వెంటనే అతడిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

టీడీపీ పాలనలోనే సంక్షేమానికి పునాది : గన్ని


దేవరగోపవరంలో ఇంటింటికి వెళ్తున్న గన్ని

నిడమర్రు, ఫిబ్రవరి 24 : ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సంక్షేమానికి పునాది వేసిన వారుగా అన్న ఎన్టీఆర్ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరంజనేయులు అన్నారు. శనివారం దేవరగోపవరంలో 'మన ఇంటికి మన గన్ని' కార్యక్రమం కార్యకర్తల కోలాహలం మధ్య అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రచ్చబండ సమావేశంలో గన్ని మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, శ్రేయస్సు కోసం టీడీపీ-జనసేన పార్టీలు రాబోయే ఎన్నికలలో కలసి పనిచేసి నూతన ప్రభుత్వ ఏర్పాటు చేయబోతున్నాయని, అందుకు ప్రజలు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గన్ని కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి పార్టీ మ్యేనిఫెస్టో వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, కాకర్ల శివ, పొట్నూరి సింహాచలం, పోశింశెట్టి రామ్మూర్తి, గన్ని గోపాలం తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర బాధ్యతలు


రవిచంద్ర

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 24 :జంగారెడ్డిగూడెం డీఎస్పీగా యు.రవిచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పల్నాడు జిల్లా నరసరావుపేట దిశ డీఎస్పీగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఎం.ధనుంజయుడును డీపోడబ్ల్యూ -2కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రవిచంద్ర గుంటూరు దిశ డీఎస్పీగా, అంతకు ముందు సీఐగా గుంటూరు, తెనాలి రూరల్, గుంటూరు ట్రాఫిక్, క్రైం, సీఐడీ విభాగాల్లో పనిచేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సబ్ డివిజన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు కృషిచేస్తామన్నారు.

విద్యార్థులకు ఒక లక్ష్యం ఉండాలి : అసిస్టెంట్ కలెక్టర్


శ్రీపూజను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఏలూరు రూరల్ , ఫిబ్రవరి 24 : ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలి, ఈ లక్ష్య సాధనకు నిరంతరంగా శ్రమించినపుడే అనువైన ఫలితాలు అందుకోవ డానికి వీలవుతుందని ఏలూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ అన్నారు. శనివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ తొలుత చిన్న చిన్న లక్ష్యాలలో విజయాలు సాధిస్తే ఆత్మస్థైర్యం మరింత పెరుగుతుందని, సివిల్స్ సాధించడానికి ప్రణాళిక ప్రకారం చదివితే సులువైన విజయం ఖాయమన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఫణికుమార్, అరుణజ్యోతి, సౌభాగ్యలక్ష్మి, డి.లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్‌లో 25వ ఫ్యామిలీ డే వేడుకలు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏఎస్పీ, తదితరులు

ఏలూరు ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఫిబ్రవరి 24 :ఏలూరు ఇండోర్ స్టేడియంలోని ఎన్ఆర్ పేటలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్, శాంతి నగర్‌లో వున్న ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ సంయుక్త ఆధ్వర్యంలో 25వ ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఎన్. సూర్యచంద్రరావు, మెడికల్ సూపరింటెండెంట్ ఎస్. విజయమోహన్‌రావు, జడ్పీ ఛైర్‌పర్సన్ జి.పద్మశ్రీప్రసాద్ విచ్చేశారు. విద్యార్థులు సందేశాత్మక నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ ఛైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, డైరెక్టర్లు విజయ భాస్కరరెడ్డి, జోసఫ్ రెడ్డి, రీజనల్ ఇన్‌చార్జి ఉమారాణి పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఉంగుటూరు,ఫిబ్రవరి 24 : సీపీఎస్, జీపీఎస్ విధానాల వల్ల కలిగే నష్టాలను వివరించి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని మండల యూటీఎఫ్ కోరింది. శనివారం నారాయణపురం వచ్చిన ఏలూరు జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి. జోగినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీ.హెచ్.శ్రీధర్, శీతాల సత్యనారాయణ, హరికృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మిడి ప్రసాద్, బాబావలి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి వనిత


శ్రీవారి ఆలయంలో చిత్రపటాన్ని అందుకుంటున్న హోంమంత్రి వనిత

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24: చినవెంకన్నను హోంమంత్రి తానేటి వనిత శనివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ద్వారకాతిరుమలలో రెండు అంతర్గత రహదారులను ఆమె ప్రారంభించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గుండుగొలనుకుంటకు వెళ్లే రహదారికి రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, యాదవ కాలనీ నుంచి సత్తెన్నగూడెం వెళ్లే దారికి రూ.35 లక్షలు వ్యయంతో బీటీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు, జడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, చెలికాని రాజబాబు, ఇమ్మడి నాగు, గుర్రాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ కార్యక్రమానికి జిల్లా అధికారులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24: భారత్ మండపం ప్రగతి మైదాన్ న్యూఢిల్లీలో శనివారం ఉదయం జరిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ, ఆహార నిల్వల కేంద్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పీఎం నరేంద్రమోదీ, ఆర్థిక, హోంమంత్రి అమిత్‌షా పాల్గొన్న కార్యక్రమానికి ఏలూరు డీసీసీబీ సీఈవో శ్రీదేవి, జీఎం మాధవి, ద్వారకాతిరుమల సొసైటీ సీఈవో నల్లూరి శ్రీకిషోర్ తదితరులు హాజరయ్యారు.

సీఆర్ఆర్ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : సీఆర్ఆర్ అటానమస్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను శనివారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ విడుదలచేశారు. ఈ ఫలితాలను విద్యార్థులు కళాశాల వెబ్‌సైట్‌నుంచి తెలుసుకోవాలని సూచించారు. జవాబుపత్రాల రీవాల్యుయేషన్ కోసం మార్చి 5లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామరాజు, పరీక్షల కంట్రోలర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టులలో అప్రమత్తంగా ఉండాలి

టి.నరసాపురం, ఫిబ్రవరి 24 : రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీసులు చెక్ పోస్టుల దగ్గర అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శుభాష్ తెలిపారు. మండలంలోని తెలంగాణ సరిహద్దు మర్రిగూడెం పంచాయతీలోని లంకాలపల్లి చెక్ పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం మర్రిగూడెం, మక్కినవారిగూడెం గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు సుభాశ్‌చంద్రబోస్, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 24 : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ విజయకుమార్ తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన మహిళ శనివారం తెల్లవారుజామున ఉదయం సుమారు రెండు గంటల సమయంలో మరుగుదొడ్డికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ తెలియలేదు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.







పెదవేగిలో ఓటు వినియోగంపై వైద్య సిబ్బంది ప్రదర్శన, ద్వారకాతిరుమలలో ఐసీడీఎస్, వైద్యసిబ్బంది మానవహారం, లింగపాలెంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి

ఎస్పీ మేరీ ప్రశాంతి ▸ ఓటు హక్కు వినియోగంపై ప్లకార్డులతో ప్రదర్శన, ర్యాలీలు, మానవహారం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా పోలీసుశాఖ పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పోలీసు అధికారులను ఆదేశిం చారు. శనివారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సులో ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలతో నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని అక్కడ సదుపాయాలపై వివరాలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం విధులను నిర్వర్తించాలన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నివాసం ఉంటున్న రౌడీషీటర్లను ముందస్తుగా బైండోవర్ చేయాలని, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను అమలు చేసి ముద్దాయిలను కోర్టుకు హాజరు పర్చాలన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. శాంతి భద్రతల కోసం అందరం కలిసి సమష్టిగా కలిసి పనిచేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టి సీఆర్‌పీసీ 107, 110 సెక్షన్ల కింద అల్లర్లు చేసే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం వంటిది : తహసీల్దార్ ప్రసాద్

లింగపాలెం, ఫిబ్రవరి 24: లింగపాలెంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లింగపాలెంలోని ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో బీఎల్‌వోలు 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకునేలా వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఓటుహక్కు వజ్రాయుధం వంటిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్తి, ఎంఈవో రామారావు, అంగన్‌వాడీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో ర్యాలీ

ఉంగుటూరు :ఓటు హక్కు ప్రాధాన్యంపై శనివారం పీహెచ్‌సీ సిబ్బంది, వెంకటనారాయణ మెమోరియల్ ఐటీఐ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు వైద్యాధికారి డాక్టర్ కలిదిండి సుబ్బరాజువర్మ, శ్రావణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, ఐటీఐ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు-మన జన్మ హక్కు, ఓటు హక్కు వినియోగించుకో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించు వంటి నినాదాలు చేసి మానవహారం నిర్వహించారు.

ద్వారకాతిరుమలలో భారీ ర్యాలీ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24: ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ ఐసీడీఎస్, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది ద్వారకా తిరుమలలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గుడి సెంటర్ మీదుగా గరుడాళ్వార్ విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం గరుడాళ్వార్ కూడలిలో మానవహారం నిర్వహించారు. అర్హులైన ప్రతీఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీవో తిరుపతిరావు, పీహెచ్‌సీ వైద్యుడు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

అవగాహన ఉంటేనే వేసే ఓటుకు విలువ : డాక్టర్ మాధవి

పెదవేగి, ఫిబ్రవరి 24 : ఓటు వేసే విధానంపై అవగాహన ఉండాలని, అప్పుడే ఓటుకు విలువ అని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి అన్నారు. భయంతోనో, ప్రలోభాలకు లోనయ్యో ఓటును వేయవద్దని, అది ఓటు విలువ తగ్గడంతోపాటు రాష్ట్రాభివృద్ధికి విఘాతాన్ని కలిగిస్తుందన్నారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెదవేగిలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా, సక్రమంగా వినియోగించుకుని, సమాజ ప్రగతికి దోహదపడాలని ఆమె పిలుపునిచ్చారు. సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




ఏలూరులో బడేటి చంటికి స్వీట్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు, కామవరపుకోటలో రోషన్‌కుమార్‌కు నాయకుల అభినందనలు

టీడీపీ సంబరాలు

▸ బడేటి చంటి నివాసంలో కార్యకర్తల ఆనందం

▸ సొంగా రోషన్‌కుమార్‌కు పలువురి అభినందనలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 24: ఏలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఖరారు కావడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చంటి నివాసం వద్ద నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంటి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థిగా టిక్కెట్ కేటాయించిన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరూ కలిసికట్టుగా టీడీపీ జెండా గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. కచ్చితంగా గెలిచి తీరుతామని కార్యకర్తలు నినాదాలు చేస్తూ చంటికి శుభాకాంక్షలు తెలిపారు.

సొంగా రోషన్‌కుమార్‌కు అభినందనలు

కామవరపుకోట, ఫిబ్రవరి 24 : అందరికీ అందుబాటులో ఉంటానని, ఐకమత్యంగా వచ్చే ఎన్నికల్లో విజయం సాధిద్దామని టీడీపీ-జనసేన కూటమి చింతలపూడి నియోజక అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం టీడీపీ అధిష్ఠానం రోషన్‌కుమార్ పేరును ప్రకటించిన నేపథ్యంలో ఆయనను మండలంలోని టీడీపీ, జనసేన నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కోనేరు గార్డెన్ నర్సరీ వద్ద చింతలపూడి ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, నర్సరీ అధినేత కోనేరు వెంకట్రామయ్య, మోహన్, జయకృష్ణ, మిత్రబృందం కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోషన్‌కుమార్ మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఖాన్‌వజీర్, మిత్రబృందంతో కొద్దిసేపు భేటీ అయ్యారు. టీడీపీ నేతలతోపాటు జనసేన మండల ఇన్‌చార్జి ఎస్.కె.వలీ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం, ఫిబ్రవరి 24: అయ్యప్పరాజుగూడెంలో తెలుగుదేశంపార్టీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పర్యటించారు. మాజీ జడ్పీటీసీ గుత్తాసత్యసాయివరప్రసాద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులను కలిసి వారితో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అంతా ఒకేతాటిపై నిలబడి పార్టీ గెలుపునకు కృషిచేయాలని తెలిపారు.

ఉపాధి సిబ్బంది పనులపై దృష్టి పెట్టడం లేదు

▸ డ్వామా పీడీ రాము

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 : ఉపాధి హామీ సిబ్బంది పనులపై శ్రద్ధ పెట్టడం లేదని దీనికి కారణం ప్రతి బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం ఏర్పాటు చేసి కొలతలు, ప్రమాణాలపై వివరించకపోవడం తదితర అంశాలను సరిగా తెలియజేయడం లేదని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.రాము తెలిపారు. శనివారం ఉంగుటూరు మండలంలోని అన్ని గ్రామాల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. గత ఏడాదికి ఈ ఏడాదికి కూలీలకు పని కల్పించడంలో వ్యత్యాసంపై వెల్లమిల్లి, కైకరం, చేబ్రోలు, గొల్లగూడెం గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు అందజేశారు. గోపీనాథపట్నంలో వెల్‌నెస్ సెంటర్ నిర్మాణంలో పిల్లర్ కుంగి పోవడంతో ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు తల్లాపురంలో ఆర్బీకే నిర్మించిన సమయంలో జరిగిన తప్పిదానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నుంచి రికవరీ కోరారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి అళ్ల విజయలక్ష్మి, స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీడీవో శర్మ, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు, బాబ్జి, పుప్పాల గోపి, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల భూములపై స్పష్టత ఇవ్వండి

చింతలపూడి, ఫిబ్రవరి 24:చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు స్పష్టత ఇవ్వాలని నిర్వాసితుల కమిటీ కార్యదర్శి చిట్టూరి అంజిబాబు ఓ ప్రకటనలో కోరారు. ఎత్తిపోతల భూముల రైతులకు పరిహారం పెంచి ఇస్తామని ఇవ్వలేదని, ఇప్పుడు కనీసం తమ భూములను బ్లాక్ లిస్టు నుంచి ఎత్తివేయాలని, బ్లాక్ లిస్టులో ఉండడం వల్ల రుణ సౌకర్యం గాని, పంటలు వేసుకునే అవకాశం గాని, ప్రభుత్వం నుంచి రాయితీలుగాని పొందలేకపోతున్నామన్నారు. ఇప్పటికైనా పరిహారం పెంచి ఇవ్వండి లేదా బ్లాక్ లిస్టులో ఎత్తివేయడం వల్ల కనీసం రుణాలు పొంది పంటలు వేసుకుంటామని చెప్పారు. మళ్లీ ప్రాజెక్టు పనులు ప్రారంభించినప్పుడు సహకరిస్తామని, తమ భూములు ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరంలేదని, ప్రభుత్వం తమకు సహకరించాలని కోరారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 24 : స్థానిక తూర్పువీధిలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద జరుగుతున్న తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం శేష వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ నిర్వహించారు.

రామకోటిలో లలితా సహస్రనామ కుంకుమార్చన

స్థానిక రామకోటి ప్రాంగణంలోని ఉత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన పాదర్తి జ్యోతి ఆధ్వర్యంలో 310 మంది మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ కుంకుమార్చన ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించారు. తొలుత గోపూజ జరిపారు.

వైభవంగా వీరభద్రస్వామి గ్రామోత్సవం

కామవరపుకోట, ఫిబ్రవరి 24 : స్థానిక భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయం వద్ద జరుగుతున్న పాంచాహ్నిక ధ్వజారోహణ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామిని నంది వాహనంపై అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వీరభద్రస్వామి అన్నదాన కమిటీ, ఫ్రెండ్స్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

పారిజాతగిరి శ్రీవారికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 24 : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా తెల్లవారుజామున 5 గంటల నుంచే భక్తులు బారులుతీరారు. సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నివేదన తీర్థప్రసాదాగోష్ఠి అనంతరం భక్తులకు స్వామి వారు దర్శనమిచ్చారు. జిల్లాలో పలు ప్రాంతాలు తణుకు, సిద్ధాంతం, దొంగరాయిపాలెం, పాలకొల్లు నుంచి భక్తులు అధిక సంఖ్యలో కాలినడకన స్వామివారి కొండపైకి వచ్చి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాతలుగా హైదరాబాద్‌కు చెందిన వేగేశ్న రామచంద్రరాజు, సంధ్యారాణి, తేజపవన్ వ్యవహరించారు.

రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ, రెవెన్యూ అధికారుల సంఘం ముద్రించిన 2024 సంవత్సరం డైరీని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు చేతులమీదుగా ఆవిష్కరించామని రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులన్నీ అర్హులైన వీఆర్వోలతో అడ్‌హక్ ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని కోరినట్టు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ, వి.ప్రసన్న, ఎం.బాపూజీ, గోపాలకృష్ణ, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు.. రైతుల నిరసన ప్రదర్శన

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 24:వ్యవసాయ, పారిశ్రామికరంగాల్లో ప్రపంచవాణిజ్య సంస్థ ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో ఈనెల 26న నిరసన ప్రదర్శన చేపట్టాలని ఏపీ రైతు సంఘాల జిల్లా సమన్వయకమిటీ పిలుపునిచ్చింది. శనివారం పవర్‌పేటలోని అన్నే భవన్‌లో రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు, రైతుసంఘం సభ్యులు ఎస్.వెంకట్రావు మాట్లాడారు. పలు రైతు కార్మిక ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాతబస్టాండ్‌లో సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలి

చింతలపూడి, ఫిబ్రవరి 24 :చింతలపూడి నగర పంచాయతీలోని పాతబస్టాండ్‌లో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు ఆర్.వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, 30 ఏళ్లుగా మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్ని విజ్ఞప్తులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రయాణికుల కోసం స్పందించాలని కోరారు.

విద్యతోపాటు నాణ్యమైన వసతులు కల్పించాలి


పాఠశాలలో పరిశీలిస్తున్న సురేష్‌కుమార్ తదితరులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 24 : విద్యార్థులకు సరైన విద్యతోపాటు నాణ్యమైన వసతులు కల్పించాలని జూనియర్ సివలిల్ జడ్జి సీహెచ్. కిషోర్‌కుమార్ అన్నారు. జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో వసతి సౌకర్యాలపై శనివారం ఆయన సందర్శించి ఆరా తీశారు. ఈ క్రమంలో వంటశాల, తాగునీరు సరఫరా, విద్యార్థులు భోజనం చేసే డార్మెటరీ పరిశీలించారు కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 24 :ఇటీవల అలివేరులో జరిగన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుంజా కన్నయ్య, దుర్గమ్మ కుటుంబానికి జీసస్ లవ్ ఇన్ కేర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. శనివారం మినిస్ట్రీస్ వ్యవస్థాపక డైరెక్టర్స్ కె.గాబ్రియేల్, విక్టోరియా వారి ఆధ్వర్యంలో రూ.10 వేల నగదుతో పాటు వంటసామగ్రి, సరుకులను అందజేశారు. కార్యక్రమంలో కె.పౌల్, సైమన్, జోషప్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

భీమడోలు, ఫిబ్రవరి 24 : గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన సూరప్పగూడెం హైవేపై జరిగింది. తమిళనాడు అప్పురపాలాయంకు చెందిన ఎం.రామస్వామి (48) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 9న అతడు పనిచేస్తున్న లారీపై చెన్నై నుంచి జమ్‌షెడ్‌పూర్ వెళ్లి తిరిగి చెన్నై వెళ్తుండగా ఈనెల 21న సూరప్పగూడెంకు వచ్చేసరికి రామస్వామి ఛాతీలో నొప్పి ఉందని లారీని పక్కన పెట్టి అక్కడే కూలబడిపోగా లారీలో ఉన్న మరో డ్రైవర్ సుందర్‌రాజన్ అదే లారీలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రామస్వామి మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

▸ పీఆర్ ఇంజినీరింగ్ అధికారుల నిరసన


జడ్పీవద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీరాజ్ ఏఈలు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : సమస్యలు పరిష్కరించాలని, ఎస్ఎఫ్‌టీ పనులపై విజిలెన్స్ విచారణ నిలుపుదల చేయాలని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు డిమాండ్ చేశారు. శనివారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పంచాయతీరాజ్ ఇంజినీర్స్ జేఏసీ ఛైర్మన్ ఉప్పలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఇంజినీరింగ్ పోస్టులు భర్తీ చేయాలని, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్.మురళీకృష్ణ, ఎం.విజయ్ కుమార్, రమణమూర్తి, డీఈలు సురేష్, లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి కోర్టు విధులకు న్యాయవాదులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 :ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టం 2022ను రద్దు చేయాలంటూ కొంతకాలం నుంచి ఏలూరుబార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి రిలే నిరాహారదీక్షలను శనివారం వరకు కొనసాగించారు. సోమవారం నుంచి కోర్టు విధులకు హాజరు కానున్నా రు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఈనెల 2వ తేదీన గుంటూరులో జరిగే సదస్సుకు హాజరై అక్కడ తదుపరి నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో తాత్కాలికంగా తమ ఉద్యమాన్ని నిలుపుదల చేస్తున్నట్టుగా బార్ అసోసియేషన్ నాయకులు వెల్లడించారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24: ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామ పంచాయతీల్లో ఉన్న గ్రామీణ పేదలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం పోణంగి గ్రామ ప్రజలు ఏలూరు ఎంపీడీవో జి.ప్రణవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ సౌలభ్యం కోసం ఏలూరు నగరంలో ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేయడం వల్ల ఆ గ్రామాల్లో ఉన్న పేదలకు ఉపాధి దొరక్క వలసలు పోతున్నారన్నారు. తక్షణమే ఉపాధి పనులు ప్రారం భించాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రేమకు మారి, దేవమాత, పాప, కుమారి, వెంకటేశ్వరరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో కేంద్రం విఫలం

టి.నరసాపురం, ఫిబ్రవరి 24 :ఎన్నికల హామీలు అమలు చేయడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షుడు టీవీఎస్ రాజు విమర్శించారు. మక్కినవారిగూడెంలో ఏఐటీయూసీ కార్యాలయంలో ముఠా వర్కర్స్ యూనియన్ సమావేశం అధ్యక్షుడు మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆందోళనలో ప్రాణాలు కోల్పోయిన శుభ్‌చరణ్ సింగ్ కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, మక్కినవారిగూడెం ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మల్లెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

టి.నరసాపురం, ఫిబ్రవరి 24 : బొర్రంపాలెం ఎంఆర్‌సీ కాలనీలో శనివారం జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి సూరిబాబు చేతుల మీదుగా రూ.40లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొత్త ప్రకాశ్‌బాబు, ఎంపీటీసీ కలపర్తి సుజాత, రామకృష్ణ, తోట శ్యామల, గంగాధర్, సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ, మునీశ్వరరావు, ఉమ్మడి తేజ, మాణిక్యాలరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పో

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : ఎన్ఆర్ పేట నెల్లూరు రవీంద్రభారతి స్కూలులో శనివారం సైన్స్ ఎక్స్‌పో జరిగింది. విద్యార్థులు సుమారు 300 ప్రదర్శనలు పెట్టారు. ఎమ్మెల్యే ఆళ్ళ నాని, మేయర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ శిరీష, డీన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జబర్దస్త్ టీం ప్రచార సందడి

భీమడోలు, ఫిబ్రవరి 24 : నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్న గారపాటి చౌదరికి ఓటు వేసి మద్దతుగా నిలవాలని సినీ గేయరచయిత అనంత శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఆగడాలలంక, గుండుగొలను, భీమడోలు, పూళ్ళ గ్రామాల్లో ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోద్, ఇమ్మానియేలు వారి కామెడీ షోతో నవ్వించారు. సినీ గాయనీ గాయకులు అరుణ్ కౌంటిన్యా వినూత్న పాటలు స్థానికులను ఉత్సాహపరిచాయి.

నేడు రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన విజయవంతం చేయాలి

భీమడోలు, ఫిబ్రవరి 24 :ఏలూరులో ఈనెల 25న జరిగే కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యటనను విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు పిలుపునిచ్చారు. బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్‌పటేల్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు నియోజకవర్గ కో-కన్వీనర్ వెజ్జు ధర్మారావు, శోభారాణి, వర్ధినీడి కపిరాజు, ఎం.కృష్ణకుమారి, రామలక్ష్మి, బీసీ, ఎస్సీ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సీఆర్ రెడ్డి మహిళా కాలేజీ వార్షికోత్సవం

పెదపాడు, ఫిబ్రవరి 24 : వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి మహిళా కాలేజీ 37వ వార్షికోత్సవ సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టరు జి.సుధాకర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు సరైన అకడమిక్ ప్రణాళికను ఎంచుకుని జీవితంలో ఉన్నతస్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎంటీఎస్ ప్రసాద్, శైలజ, విశ్వనాధరావు, రాజ్యలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వలసపల్లి సచివాలయ భవనంపై ఉన్న వైసీపీ ఫ్లెక్సీ

సచివాలయ భవనంపై వైసీపీ ఫ్లెక్సీ!

సచివాలయాల్లో రాజకీయాలకతీతంగా ప్రజాసమస్యల పరిష్కారంపై మాత్రమే దృష్టి పెట్టాల్సి ఉండగా, ముసునూరు మండలం వలసపల్లి గ్రామ సచివాలయ అధికారులు మాత్రం ఇదిగో ఇలా అధికార పార్టీ సేవలో నిమగ్నమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోను నాయకుల బ్యానర్‌ను ఏకంగా సచివాలయంపై ఏర్పాటు చేయడంపై నిరసన వ్యక్తమవుతోంది.

-ముసునూరు

హ్యాండ్‌వాష్‌కు నీరు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24: నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న హ్యాండ్‌వాష్ ట్యాంక్‌లో ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు నీటిని నింపారు. నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ట్యాంక్‌లో నీరు లేకపోవడం, డస్ట్ బిన్‌లు నిరుపయోగంగా ఉన్న విషయమై ఆంధ్రజ్యోతిలో శనివారం ఆశయం ఘనం, ఆచరణ శూన్యం శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు స్పందించి హ్యాండ్‌వాష్ ట్యాంక్‌లో ఎప్పటికప్పుడు నీటి లభ్యత ఉండేలా చర్యలు చేపట్టారు.

దివ్యాంగ విద్యార్థులకు ఇంటి వద్దే విద్య

ముసునూరు, ఫిబ్రవరి 24: రమణక్కపేటలోని భవిత సెంటర్‌కు రాలేని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇంటి వద్దే విద్యా కార్యక్రమాన్ని ఐఈఆర్టీలు శనివారం నిర్వహించారు. ఐఈఆర్టీలు లక్ష్మీనారాయణరావు, నాగమల్లేశ్వరి 10 మంది దివ్యాంగ పిల్లల ఇంటికి వెళ్ళి వారికి విద్య నేర్పారు. అలాగే వారి జీవన నైపుణ్యం, ఫిజియోథెరపీ చికిత్స, ఇతర మెలకువలపై తల్లిదండ్రులకు పలు సూచనలు ఇచ్చారు.

ఆక్రమణలు 24 గంటల్లో తొలగించాలి : చిన్నం



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24: నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆక్రమణలను 24 గంటల్లో తొలగించాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన కోట్లాది రూపాయల భూములను కొందరు ఆక్రమించి, ప్రహరీ గోడలు నిర్మించారని, భూమిని పరిరక్షించాల్సిన పాఠశాల సిబ్బంది, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది కనీసం కన్నెత్తి చూడకపోవడం శోచనీయమన్నారు. పాఠశాలకు చెందిన సుమారు 250 నుంచి 400 గజాల వరకు భూమి ఆక్రమణకు గురైందని, సదరు ఆక్రమణలను 24 గంటల్లో తొలగించని పక్షంలో తన మద్దతుదారులు, పట్టణ ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు.

సరిహద్దుల ప్రకారమే గోడ నిర్మాణం...

వాస్తవ సరిహద్దుల ప్రకారమే తమ భూమికి ప్రహరీ గోడను నిర్మించటం జరిగిందని, నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ తెలిపారు. పాఠశాలను ఆనుకొని ఉన్న భూమిని 1976లో అహ్మద్ హుస్సేన్‌కు కోర్టు ద్వారా సంక్రమించిందన్నారు. అయితే అందులో ఉన్న పాత భవనాలను తొలగించి పాఠశాల సిబ్బందికి హద్దులు చూపించి ప్రహరీగోడ నిర్మించామన్నారు. రామకోటయ్య తన దగ్గర ఉన్న ఆధారాలను పునఃపరిశీలించాలని ఆయన కోరారు.

పొగాకు రైతుల్లో ఆందోళన



ముసునూరులో పొగాకు పందిరిపై పరదాలు కప్పిన దృశ్యం

ముసునూరు, ఫిబ్రవరి 24: వాతావరణ శాఖ హెచ్చరికలతో పొగాకు రైతుల్లో ఆందోళన నెలకొంది. వాతావరణం మేఘావృతమై ఉండటంతో పొగాకు పందిళ్ళపై రైతులు పరదాలు కప్పుతున్నారు. ఒకవైపు పొగాకు కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో వర్షం కురిస్తే నిండామునిగిపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 40 శాతం పొగాకు కోతలు పూర్తయి పంట పందిళ్ళపై ఉంది. ఈ పంటను కాపాడుకునేందుకు రైతులు పరదాల కోసం పలు ప్రాంతాలకు పరుగులు తీసి, పందిళ్ళపై కప్పి కాపాడుకుంటున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు పొగాకు పంట దెబ్బతినడంతో దిగుబడి బాగా తగ్గి, పెట్టుబడి పెరిగిందని, తీరా పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురిస్తే ఆర్థికంగా కోలుకోలేని రైతులు వాపోతున్నారు.

క్రైం కార్నర్



టాటా ఏస్ వాహనం పల్టీ కొట్టిన దృశ్యం

టైరు పంక్చరై.. వాహనం బోల్తా

ఐదుగురికి తీవ్ర గాయాలు

ముసునూరు, ఫిబ్రవరి 24: మండలంలోని చిల్లబోయినపల్లి ప్రధాన రహదారిలో శనివారం సాయంత్రం టాటా ఏస్ వాహనం టైరు పేలి పల్టీ కొట్టిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు గాయపడ్డారు. ఏలూరు జిల్లా పేదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ వీరంపాలెంకు చెందిన 15 మంది టాటా ఏస్ వాహనంలో ముసునూరు మండలం చిల్లబోయినపల్లి వచ్చి మరో ఐదుగురుని ఎక్కించుకుని గోపవరం గ్రామంలో ఉదయం జరిగిన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠకు వచ్చారు. అయితే వీరు సాయంత్రం తిరిగి వెళుతున్న క్రమంలో చిల్లబోయినపల్లి ప్రధాన రహదారిలో టాటా ఏస్ వాహనం వెనుక టైర్ ఒక్కసారిగా పేలి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా వీరిలో ఇద్దరు మహిళలకు తలకు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన 15 మంది గాయాలపాలయ్యారు. వైస్ ఎంపీపీ పాముల గంగధరరావు, స్థానికులు క్షతగాత్రులను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనను ఎస్ఐ వాసు పరిశీలించారు.



ఖైదీలకు ఏర్పాటు చేసిన సెల్స్..



కైకలూరు సబ్‌జైల్ ప్రధాన ద్వారం

బ్రిటీష్ కాలం నాటి కట్టడం..

కనుమరుగు

- కైకలూరులో 111 ఏళ్ల క్రితం నిర్మించిన జైలు త్వరలో కూల్చివేత
- ఏర్పాటు కానున్న కొత్త సబ్ జైలు
- ఇప్పటికే ఖైదీలు మచిలీపట్నం తరలింపు



జైలు వెనుకవైపు గోడలు

కైకలూరు, ఫిబ్రవరి 24: బ్రిటిష్ కట్టడాలకు కాలం చెల్లింది. మారుతున్న కాలంతో పాటు ఆధునిక వసతులతో కట్టడాలను చేపడుతున్నారు. 1913లో బ్రిటిష్ అధికారులు నిర్మించిన జైళ్లల్లో కైకలూరు పట్టణంలోని సబ్‌జైలు ఒకటి. కైకలూరు కేంద్రంగా పూర్వం బ్రిటిష్ పాలన సాగుతూ వస్తుండగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి ఆనుకుని 24 సెల్స్ ఏర్పాటు చేస్తూ జైలు నిర్మించారు. ఈ పురాతన జైలుకు శిథిలావస్థకు చేరడంతో జైళ్ళశాఖ అధికారులు దీనిని కూల్చివేసి ఆధునిక వసతులతో కూడిన జైలు నిర్మాణానికి గత ఏడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. రూ. రెండు కోట్లతో దీనిని నిర్మించనున్నారు. రెండు రోజుల క్రితం 16 మంది ఖైదీలను మచిలీపట్నంలోని ఉమ్మడి కృష్ణా జిల్లా జైలుకు తరలించారు. సుమారు ఏడేళ్ల క్రితం వరకు 24 సెల్స్‌లో 4 సెల్స్‌ను మహిళా ఖైదీలకు వినియోగించుకునేలా జైలుశాఖ అధికారులు ఏర్పాటుచేశారు. అనంతరం మహిళా ఖైదీలను కైకలూరులో కాకుండా ఏలూరు కారాగారాలకు తరలించేవారు. నూతనంగా నిర్మించే జైల్లో ప్రత్యేకంగా మహిళా విభాగం ఏర్పాటు చేస్తున్నారు. బ్రిటిష్ కాలం నాటి జైల్లో దివంగత నాయకుడు వంగవీటి రంగా మూడు నెలల పాటు ఒక కేసులో ఇక్కడే శిక్ష అనుభవించినట్లుగా ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఎన్నో లక్షల మంది ఈ జైల్లో శిక్ష అనుభవించినట్లు సమాచారం. ఇప్పటికే జైలు ఖాళీ అవడంతో మరో నాలుగు రోజుల్లో పాత భవనాన్ని కూల్చే పనులు ప్రారంభిస్తున్నారు. సబ్‌జైలు కూల్చి వేస్తున్నారనే సమాచారం తెలియడంతో పురాతన కట్టడాలు కనుమరుగవుతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన



నూజివీడు, ఫిబ్రవరి 24:నూజివీడులో టీడీపీ కార్యాలయ నిర్మాణానికి ఆ పార్టీ నూజివీడు అభ్యర్థి పార్థసారథి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. నూజివీడు - విజయవాడ రోడ్డులో పట్టణ శివారులో రహ దారి పక్కనే ఉన్న స్థలంలో ఆయన తన పార్టీ కార్యాలయాన్ని నిర్మించనున్నారు. మరోవైపు నూజివీడులో నివాసం ఉండడానికి నివాస గృహాన్ని కొనుగోలు యత్నాల్లో నిమగ్నమ య్యారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

యాదవుల సమస్యలు పరిష్కరిస్తా: కొలుసు

తన గెలుపునకు యాదవ సంఘం మద్దతు ఇవ్వాలని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి కోరారు. శనివారం నూజివీడు యాదవ సంఘ కార్యాలయంలో సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు నక్కనబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన యాదవ సంఘం ఆత్మీయ సమావేశంలో పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు పలు సమస్యలను పార్థసారథి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ స్థాయి బీసీ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకుంటానన్నారు. పార్థసారథిని గెలిపించుకునేలా కృషి చేస్తామని యాదవ సంఘం నాయకులు తెలిపారు. మండల, గ్రామ స్థాయి నాయకులు గుండుబోయిన లక్ష్మణరావు, కొలుసు రవికుమార్, జోనుబోయిన రాంబాబు, గరికపూడి నాని, కొలుసు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24: ఎన్ఎస్ఎస్ క్యాంపులో రెండోరోజు వలంటీర్లు నూజివీడు మండలం మిట్టగూడెంలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. నూజివీడు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల అనంతరం ప్లాస్టిక్ వినియోగం తగ్గించే విధానాలను, ప్లాస్టిక్ వినియోగం వల్ల దుష్పరిణామాలను గ్రామస్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.



ఇంటింటికి కరపత్రాలు అందజేసి కొడాలి వినోద్ ప్రచారం

ముదినేపల్లి మండలంలో బాబు ష్యూరిటీ..

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 24: బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా శనివారం మండల టీడీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గం పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకామనపూడి పెదకామనపూడి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు ద్వారా మహిళలకు వివరించారు. జగన్ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో ప్రజలను ఏ విధంగా ఇబ్బందులకు గురి చేసింది వివరించారు. టీడీపీ నాయకురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి, దావు నాగరాజు, పంతగాని సురేష్, జాస్తి రాజా, తలారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన ఎన్ఆర్ఐ విద్యార్థులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 24: ఆగిరిపల్లి ఎన్ ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దత్తత గ్రామమైన కనసానపల్లిలో శనివారం ఎన్ఆర్ఐ విద్యార్థులు మొక్కలు నాటారు. భూతాపం పెరగకుండా పర్యావరణాన్ని కాపాడేందుకు సుమారు 200 మంది ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ విద్యార్థులు మొక్కలు నాటారని కళాశాల చైర్మన్ డాక్టర్ వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమం ఏడాదిలో వారం రోజులు ఉంటుందని ప్రిన్సిపల్ నాగభాస్కర్ తెలిపారు. సర్పంచ్ సంజీవయ్య, విద్యార్థులకు, కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24: నూజివీడు పట్టణంలో ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఈఈ ఏ.సత్యనారాయణ తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ, బంగినపల్లితోట, సమతానగర్, నెహ్రూపేట, పండ్ల మార్కెట్ సెంటర్, కోవెల రోడ్డు, డీఎస్పీ ఆఫీస్ ఏరియా, అప్సరా థియేటర్ ఏరియా, కోటవారిపేట, కృష్ణవిలాస్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చాట్రాయిలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

యువత పోలింగ్ శాతం పెంచాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24: రానున్న ఎన్నికల్లో యువత చురుగ్గా పాల్గొని పోలింగ్ శాతం పెంపునకు కృషి చేయాలని నూజివీడు ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో జాస్తి జగన్మోహన్‌రావు అన్నారు. నూజివీడు పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

చాట్రాయి: ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని, మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చాట్రాయిలో శనివారం ఓటర్లకు అవగాహన సమావేశం, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయలక్ష్మి, శ్రీనివాసులరెడ్డి, దుర్గాప్రసాద్, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, ఏపీఎం శేఖర్, అంగన్వాడీ సూపర్‌వైజర్ గాయత్రి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని బలపరుద్దాం

మండవల్లి: ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని బలపరుద్దాం అని మండవల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు లీడర్ సీహెచ్. చెల్లమ్మ ఆధ్వర్యంలో మూడు తాళ్లపాడు గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే భవిత.. లేదంటే అంధకారం అని అవగాహన కల్పించారు. ఏఎన్ఎం పద్మజ, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన బాలరావమ్మ తిరునాళ్ళు



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 24:దుగ్గిరాల బాలరావమ్మ మాఘపౌర్ణమి తిరునాళ్ళ సందర్భంగా శనివారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తోటపల్లి, కనసానపల్లి, ఆగిరిపల్లి గ్రామాల్లో గల అమ్మవారి ఆలయాలకు సుదూర ప్రాంతాల భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మూడు ఆలయాల్లోను మధ్యాహ్నం అన్నదానం జరిగింది. నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ కొలుసు పార్థసారథి, తోటపల్లి, ఆగిరిపల్లిలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రజలను చల్లగా చూడాలని వేడుకున్నట్టు తెలిపారు.

వైభవంగా నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ముసునూరు, ఫిబ్రవరి 24: గోపవరంలో నిర్మించిన ఆలయంలో నాగేంద్రస్వామి విగ్రహ, ఆలయ శిఖర, పరివార ప్రతిష్ఠ మహోత్సవాలను శనివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారాంజనేయ చౌదరి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. గారపాటి చౌదరి ఆలయ నిర్మాణానికి రూ. 6 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ముప్వ వెంకటేశ్వరరావు దంపతులు, శివకోటి ఫణీంద్ర దంపతులు రూ1.20 లక్షల విలువైన కిరీటాన్ని స్వామివారికి సమర్పించారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ కమిటీ భారీ అన్నసమారాధన నిర్వహించింది. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ముసునూరు ఎస్ఐ పి.వాసు బందోబస్తు నిర్వహించారు.

ఆధ్యాత్మికం

ముగిసిన రాజవరప్రసాద మాత మహోత్సవాలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 24: ఆగిరిపల్లి మండల పరిధిలోని రాజవరం గ్రామంలో గల రాజవరప్రసాద మాత మహోత్సవాలు శనివారం ముగిశాయి. మధ్యాహ్నం భారీ సమారాధన జరిగింది. రాత్రి 10.30 గంటలకు భారీ బాణాసంచా కాల్చారు. అనంతరం ధనవంతుడు బీదలాజరు నాటకం ప్రదర్శించారు. పెద్దఎత్తున విశ్వాసులు పాల్గొన్నట్టు కమిటీ చైర్మన్ తట్టుమాల చక్రవర్తి తెలిపారు.

నేటి నుంచి చెన్నకేశవస్వామి వార్షికోత్సవాలు

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 24: చిన్నపాలపర్రులోని చెన్నకేశవ స్వామి ఆలయ 24వ వార్షికోత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల చివరి రోజున భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సూరంపాలెంలో అన్నదానం



చాట్రాయి, ఫిబ్రవరి 24: సూరంపాలెం వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం బూరుగుగూడెంకు చెందిన జుజ్జూరు గురవారెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు స్వామివారికి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కాంగ్రెస్‌కు జెట్టి గురునాథరావు రాజీనామా



జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం,ఫిబ్రవరి 24 : కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జెట్టి గురునాథరావు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మెయిల్ ద్వారా పంపారు. కాంగ్రెసు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ క్యాడర్‌ను కాపాడుకుంటూ పార్టీలో ఉన్న ఆయన ఎన్నికలకు ముందు ఆకస్మాత్తుగా పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశం అయ్యింది. అధికార పార్టీ వైసీపీలో చేరనున్నట్టు తెలిసింది. గతేడాది కూడా గురునాథరావు టీడీపీలోకి మారుతున్నారనే ప్రచారం సాగింది. అయితే అప్పటి నుంచి మౌనంగా ఉన్న గురున్నాధరావు ఇప్పుడు తాజాగా కాంగ్రెసుకు రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాల్లో కాంగ్రెసు పార్టీలో ఉన్న గురున్నాధరావు అనుచరులు కూడా రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. కొయ్యలగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జుంగా జవహర్‌లాల్ నెహ్రూ (బాబ్జీ) రాజీనామా చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావుకు లేఖ పంపుతున్నట్లు తెలిపారు.



నేలపై కూర్చున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈవో

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

కలిదిండి, ఫిబ్రవరి 24 : విద్యార్థులను నేలపై కూర్చోబెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో ప్రభాకర్ బాబు హెచ్చరించారు. శనివారం అమరావతిలో ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో బెంచ్‌లు ఉండగా, విద్యార్థులందరినీ నేలపై కూర్చోబెట్టడంతో ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు సెలవులో ఉండటంతో విద్యార్థులందరిని ఒకే చోట కూర్చోబెట్టినట్టు ఉపాధ్యాయుడు సమాధానమిచ్చారు. విద్యార్థులందరికీ సరిపడ బెంచ్‌లు ఉండగా, నేలపై కూర్చోబెట్టడం సబబు కాదన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎంఈవో ఉపాధ్యాయుడు సతీష్ కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ఏడు కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు నూజివీడులో సర్వం సిద్ధమైంది. నూజివీడు పట్టణంలో మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో గ్రూప్ -2 పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాల, నూజివీడు ట్రిపుల్ ఐటీ, మడపల్లి తాతయ్య జూనియర్ కళాశాల, శారద జూనియర్ కళాశాల, సిద్ధార్థ బి-ఫార్మసీ కళాశాల, ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల, నూజివీడు బాలికోన్నత పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, నూజివీడులో మొత్తం 2,288 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

చాట్రాయి, ఫిబ్రవరి 24: విద్యార్థులు కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎన్. నర్సిరెడ్డి కోరారు. స్థానిక వికాస్ కాలేజీలో శనివారం జరిగిన ఫేర్‌వెల్ పార్టీలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సభికులను అలరించారు. పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నర్సిరెడ్డి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రామ్మోహనరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా దిమ్మె ఆవిష్కరణ



చాట్రాయి, ఫిబ్రవరి 24: బీజేపీ పాలనలో దేశం సుసంపన్నం అవుతున్నదని ఏలూరు పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి గారపాటి సీతారామాంజనేయ చౌదరి సతీమణి రేణుక అన్నారు. సూరంపాలెం బీజేపీ జెండా దిమ్మెను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం నిర్మాణం, కశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు, శత్రు దేశాలను భయపెట్టేలా సైనిక పాటవాన్ని బలోపేతం చేయటం, అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించటం మొదలైనవి బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలు అన్నారు. నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి జీఆర్‌కే రంగారావు, నాయకులు ఓబిళ్ళనేని రాజా, శర్మ, సుబ్బారావు, శ్రీకర్, విద్యాధరరెడ్డి, ఎన్. వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు 'అట్లూరి' చేయూత



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 24: నూజివీడు మండలం మొర్సపూడిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్ల దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన అగ్నిప్రమాద బాధితులకు నూజివీడు అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర ఆర్థిక సాయం అందించారు. బాధితులు ఆరేపల్లి బసవయ్య, ఆరేపల్లి ధన కోటేశ్వరరావును ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర పరామర్శించి నిత్యావసరాలను, నూతన వస్త్రాలను, నగదును అందించారు. గ్రామస్థులు పిన్నమనేని నాని, నెక్కంటి ఉపేంద్ర, షేక్ బాజీ, కేపీ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాల వితరణ

ముసునూరు, ఫిబ్రవరి 24: రమణక్కపేట జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం విజయవాడ పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్ సీనియర్ జీఎం కె.నాగమోహన్ రావు ఈ-స్లేట్స్, పుస్తకాలను బహూకరించారు. మూడో తరగతి విద్యార్థులకు 20 ఈ-స్లేట్స్, ఐదో తరగతి విద్యార్థులకు పెద్ద బాలశిక్ష, పంచతంత్రం కథల పుస్తకాలను అందజేశారు.

ఫిషర్‌మెన్ సొసైటీ ఏర్పాటుకు వినతి



ముదినేపల్లి, ఫిబ్రవరి 24 : పెదగొన్నూరులో ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటుకు సహకరించాలని ఆ గ్రామ అగ్నికుల క్షత్రియులు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావును కోరారు. శనివారం ఎంపీటీసీ తుమ్మలచర్ల యేసు, చేనేత సహకార సంఘ అధ్యక్షుడు దొంతు నాగభూషణం, సింగిడి మురళీ నాయకత్వంలో ఎమ్మెల్యేని కలసి మెమొరాండం అందజేశారు. చేపల పెంపకం, వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, తమకు ఫిషర్‌మెన్ సహకార సంఘం లేకపోవటం వల్ల ప్రభుత్వ పథకాల రాయితీలు పొంద లేకపోతున్నామని పలువురు మహిళలు ఎమ్మెల్యేకి వివరించారు. తాను మత్స్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సొసైటీ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

మైనర్లు వాహనాలు నడపటం నేరం : ఎస్ఐ



ముదినేపల్లి, ఫిబ్రవరి 24 : మైనర్లు వాహనాలు నడపటం నేరమని ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్ కుమార్ తెలిపారు. తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులేనని తెలిపారు. మోటారు వెహికల్ యాక్ట్ ప్రకారం మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే జరిమానాతోపాటు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్ల వయస్సు లోపు ఉన్న పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని, రోడ్డు నిబంధనలు తెలియని పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశాలుంటాయని హెచ్చరించారు. వాహనాలను నియంత్రించే శక్తి సామర్థ్యాలు కూడా పిల్లల్లో తక్కువగా ఉంటాయన్నారు. వాహనాలను మైనర్లు డ్రైవ్ చేయకూడదన్న అంశంపై పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించాలని పేర్కొన్నారు.